క్లుప్తంగా

రహదారికి మరమ్మతు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కమాన్‌పూర్: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌తో గురువారం మరమ్మతు చేయిస్తున్నారు. ఈ నెల 7న సాక్షి దినపత్రికలో 'ప్రమాదాల రహదారి' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు కుంగిపోయిన రహదారిపై తారువేయించి మరమ్మత్తుతు చేయిస్తున్నారు. వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఎంపీడీవో ఎం.ఏ.అలీం సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న కందకం పనులను పరిశీలించి ఉపాధి కూలీలకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ పరిశీలనలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బీఎస్పీ సోషల్ మీడియా మండల కన్వీనర్ బొంకూరి అజయ్ గురువారం బీజేపీలో చేరారు. ఆయనకు జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు ముల్కూరి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, నాయకులు దొంతుల సురేశ్, తోట్ల రాజు, ఇరుగురాల సంపత్, కొత్త కమలాకర్, ధీరజ్ కృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న కమిషనర్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీలోని ఎన్నికల కేంద్రాన్ని గురువారం రామగుండం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలోని మౌలిక సదుపాయాల తనిఖీ చేశారు. ఓటింగ్ చేయడానికి వచ్చే ప్రజలకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ రంగు నాగభూషణం, ఆడెపు శ్రీనివాస్ జున్నుసీల్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీవో సుదర్శన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీవో సుదర్శన్ పరిశీలించారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి పనులను మహిళా సంఘాలకు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పేరిట అప్పగించింది. ఇందుకు అవసరమైన బ్యాంకు ఖాతాలను ప్రారంభించిన సంఘాలకు నిధులను కూడా సమకూర్చిందని అధికారులు పేర్కొన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టినట్లు ఎంపీవో పేర్కొన్నారు.

అవకాశవాద రాజకీయాలు చేయడం సరికాదు

కమాన్‌పూర్: నిన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో ఉండి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో లబ్ధి పొంది ఇప్పుడు మంత్రి మెప్పు కోసం కాంగ్రెస్‌లో చేరి అవకాశవాద రాజకీయాలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న రోజుల్లో పార్టీ మారిన నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మేకల సంపత్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు నీలం సరిత, తాటికొండ శంకర్, నాయకులు బొమ్మగాని అనిల్, రాసకొండ రవి, పొన్నం రాజేశ్వరి, నీలం శ్రీనివాస్, రామ్మూర్తి, పవన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- గోదావరిఖని ఏసీపీ రమేశ్
- ఎన్టీపీసీ, రామగుండంలో కేంద్ర బలగాల పోలీసు కవాతు



కవాతులో పాల్గొన్న ఏసీపీ రమేశ్, రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎస్సై ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాల పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. రామగుండం సర్కిల్ ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గోదావరిఖని ఏసీపీ రమేశ్, రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు, ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్, రామగుండం ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రామగుండం పట్టణంలో..

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వివిధ కంపెనీలకు చెందిన వందలాది మంది భద్రతా బలగాలు రామగుండం చేరుకున్నాయి. గురువారం గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్, రామగుండం సీఐ అజయ్‌బాబు, రామగుండం, అంతర్గాం ఎస్సైలు కందునూరి సతీశ్, బోయ వెంకట్ తదితరులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక వాహనాల్లో కమిషనరేట్‌కు తరలించారు. ఈ సందర్భంగా రామగుండంకు చేరుకున్న భద్రతా బలగాలు పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా కవాతు నిర్వహించాయి.

అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

జ్యోతినగర్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్క ఓటరు తమ విలువైన ఓటుహక్కు వినియోగించుకోవాలని కళాకారులు పాటల ద్వారా ప్రజలకు వివరించారు. గురువారం రామగుండం కార్పొరేషన్ మేడిపల్లి గ్రామంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా సీడీపీవో స్వరూపరాణి ఆధ్వర్యంలో ఓటుహక్కు ప్రాముఖ్యత గురించి సాంస్కృతిక బృందం పాటల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో దయా నర్సింగ్, గుండ్ల స్నేహలత, సానగొండ రవీందర్, జన్నే శ్వేత, నారగోని సరిత, మంథని స్పందన, ఉప్పు స్పందన, జక్కుల స్వప్న పాల్గొన్నారు.

అందరం ఓటేద్దాం

జ్యోతినగర్: 'లోక్‌సభ ఎన్నికల్లో అందరం ఓటేద్దాం .. మనతో పాటు మన చుట్టుపక్కల వారిని కూడా ఓటేయాలని చెప్తాం' అని ప్రతిజ్ఞ చేశారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని శ్రీజ్యోతి స్లమ్ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన సదస్సులో పలు తీర్మానాలు చేశారు. 13న జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలని అధికారులు సూచించారు. సదస్సులో ఆర్పీ స్వప్నతో పాటు శ్రీజ్యోతి స్లమ్ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో గురువారం వారసంతలో రాష్ట్ర కళాకారుల బృందం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కూరగాయలు, ఇతర దుకాణాల యజమానులతో పాటు కొనుగోలుదారులకు, స్థానిక ప్రజలకు ఆటపాటల ద్వారా ఓటుహక్కు వినియోగంపై వివరించారు. రాష్ట్ర సాంస్కృతిక సారథి పెద్దపల్లి జిల్లా సీడీపీవో స్వరూపరాణి, సూపర్‌వైజర్లు, కళాకారులు పాల్గొన్నారు.

కళాజాత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని చిన్నరాతుపల్లి గ్రామంలో గురువారం కళాకారులు కళాజాత నిర్వహించారు. ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొండ్ర వెంకన్నగౌడ్, ఈదునూరి పద్మ, సలేంద్ర రాజన్న, బుర్ర శంకర్‌గౌడ్, కన్నూరి రేణుక, జిన్న రమాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం చీకురాయి, పెద్దకల్వల, పెద్దబొంకూర్, రాంపల్లి, ముత్తారం, గౌరెడ్డిపేట గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ రామ్మూర్తి, నాయకులు రాజేందర్, రమేశ్, సంతోష్, కొమ్ము శ్రీనివాస్, ఓదెలు, కుమార్ ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఆడెపు సుధాకర్, నీలయ్య, శ్రీరాంపూర్ మండలం మంగపేట, వెన్నంపల్లికి చెందిన బుర్ర శ్రీనివాస్, సతీశ్ కాంగ్రెస్‌లో చేరారు.

రామగిరి: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సామాజిక రాజకీయ విశ్లేషకులు ఐ.ఆర్.వి.రాజు, జాతీయ విశిష్ట సేవారత్న అవార్డు గ్రహీత దార మధు, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ జెడ్పీటీసీలు మైదం భారతి, గంట వెంకటరమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎలిగేడు: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు, ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీశ్‌బాబు కోరారు. గురువారం మండల కేంద్రంలో సతీశ్‌బాబు మాట్లాడారు.

పాలకుర్తి: మండలంలోని రాణాపూర్, కన్నాల, జీడీనగర్ గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, పర్వవేని శ్రీనివాస్, బాలసాని కుమార్, కన్నాల మాజీ సర్పంచ్ సూర సునీత, పూరేళ్ల కవిత, కుమార్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్సీ, ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ కోరారు. పెద్దపల్లికి వెళ్లి వస్తూ గురువారం సుల్తానాబాద్‌లో కాసేపు కాలక్షేపం చేశారు. నాయకులు తిరుపతి, రఫీక్ ఉన్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా సీపీఎం నాయకులు గురువారం పెద్దపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఎం ఏరియా కార్యదర్శి రవీందర్, నాయకులు శ్రావణ్, శ్రీనివాస్, నవీన్ ఉన్నారు.

ఓదెల: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని కనగర్తి, హరిపురం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఎలిగేడు: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ గడ్డం వంశీని ఆశీర్వదించాలని కోరారు. మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, నాయకులు వెంకటేశ్వర్‌రావు, బూర్ల సింధూజ, వెంకటసత్యం, బాలసాని పర్శయ్యగౌడ్, పుల్లారావు, రమేశ్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ పట్టణంలో ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు గాజుల రాజమల్లు, కుమార్ కిషోర్, గరిగె శ్రీనివాస్, బిరుదు రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ అమిరిశెట్టి రాజలింగం, తిరుపతి, కౌన్సిలర్లు రాజయ్య, రఫీక్, రాజు ఉన్నారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. 24వ డివిజన్ ఇన్‌చార్జి కౌలాని కవితారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

జూలపల్లి: ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని స్థానిక బస్టాండు వద్ద కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడారు. జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ధూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాలరావు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆటో బోల్తా ఐదుగురికి గాయాలు

ధర్మారం: మండల కేంద్రంలోని సాయిమణికంఠ హైస్కూల్ సమీపంలో గురువారం రాత్రి ఆటో బోల్తాపడిన సంఘటనలో గోపాల్‌రావుపేటకు చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. ధర్మారంలో సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ రోడ్‌షోకు గోపాల్‌రావుపేట నుంచి ఆటోలో వచ్చి వెళ్తుండగా అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో జంగిలి బక్కయ్య, డ్రైవర్ పోతు లచ్చయ్య, తులసమ్మకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బక్కయ్య, తులసమ్మను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

'ఖని'లో నేడు పరశురాముని జయంతి

కోల్‌సిటీ: హిందూ పురాణాలలో విష్ణువు ఆరో అవతారంగా పరిగణించబడే మహర్షి పరశురాముని జయంతిని శుక్రవారం గోదావరిఖనిలో నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక పరశురామ్‌నగర్‌లోని పరశురాముని విగ్రహానికి రంగులు వేసి, ముస్తాబు చేస్తున్నారు. శుక్రవారం 8గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, అభిషేకం, హోమం తదితర ప్రత్యేక పూజలతోపాటు బోనాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

రక్షణ చర్యల లోపంతోనే ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ప్రమాదాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారంలో రక్షణ చర్యలు కల్పించడంలో విఫలం కావడంతో కర్మాగారంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ నాయకులు అంబటి నరేశ్ ఆరోపించారు. మంగళవారం కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు పనిచేసే క్రమంలో కాలు తీవ్రంగా గాయం కాగా బాధితుడిని గురువారం యూనియన్ నాయకులు అంబటి నరేశ్ పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన బాధితునికి సరైన వైద్య సదుపాయాలు అందించాలన్నారు.

షాప్‌లు కేటాయించిన తర్వాతే తొలగించాలి

గోదావరిఖని: షాపుల కోసం వేరే ప్రాంతాన్ని కేటాయించిన తర్వాతే ప్రస్తుతం ఉన్న ప్రాంతాన్ని ఖాళీ చేయించాలని చిరు వ్యాపారస్తులు కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓల్డ్ అశోక థియేటర్ ప్రహరీ ఆనుకొని 20షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నామన్నారు. 20ఏళ్ల క్రితం అప్పటి మున్సిపల్ చైర్మన్ సోమారపు సత్యనారాయణ చేపట్టిన రోడ్డు వెడల్పులో భాగంగా దుకాణాలకు సంబంధించి 75శాతం మేర నిర్మాణాలను కోల్పోయామన్నారు. మిగిలిన 25శాతం స్థలంలో చిన్న రూములు నిర్మించి దుకాణాలు నిర్వహించుకున్నామన్నారు. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇతరులు తమ దుకాణాల వద్దకు వచ్చి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని వాపోయారు. కోర్టు కూడా తమకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వ్యాపారస్తులు గాదె రాందాస్, రాజ్‌కుమార్, కొండపాక సత్యనారాయణ, షేక్‌అయూబ్, ఉపేందర్, కోటేశ్వరచారి, సురేశ్, ప్రభాకర్, జమీల్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

రామగిరి: తనపై చేసిన అసత్య ఆరోపణలపై పుట్ట మధు బహిరంగ చర్చకు సిద్ధమా అని ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి సవాల్ విసిరారు. గురువారం సెంటనరీకాలనీ శ్రీపాదభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్నర్ మీటింగ్‌లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని, అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. పట్టణ అధ్యక్షుడు కాటం సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, మండల ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్, కొలిపాక సారయ్య, వీరవేని రాజమౌళిగౌడ్, మేకల మారుతి, మోత్కూరి అవినాష్, బుద్దార్తి బుచ్చయ్య పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి

కమాన్‌పూర్: ప్రతీ మహిళ సాధికారిత దిశగా ముందుకు సాగాలని మహిళా సాధికారత కేంద్ర కోర్డినేటర్ దయా అరుణ అన్నారు. మండలంలోని కమాన్‌పూర్, జూలపల్లి, సిద్దిపల్లె గ్రామాల్లో స్వయం ఉపాధి పథకాలు వాటి వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.


'ఎంపీగా గెలిపిస్తే వెన్నంటే ఉండి సేవచేస్తా'



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: 'స్థానికుడిగా ఉన్న నన్ను గెలిపిస్తే మీ వెంట ఉండి కుటుంబ సభ్యుడిగా పనిచేస్తా' అని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం స్థానిక తిలక్‌నగర్, ఎల్‌బీనగర్, స్వతంత్రచౌక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ కార్మికుల పెన్షన్ విధానంలో మార్పు, కాంట్రాక్టు కార్మికుల వేతనాలతో పాటు అనేక సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామన్నారు. సింగరేణి కార్మికులకు వారసత్వ ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

రామగిరి: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు ముల్కూరి శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం మండలంలోని పన్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలరోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు బాధపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సెంటనరీకాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, నాయకులు దొంతుల సురేశ్, తోట్ల రాజు, మెరుగు శ్రీకాంత్, ఇరుగురాల సంపత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రెడ్డి సంఘానికి చెందిన పలువురు నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక శారదనగర్‌లోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సమక్షంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. రెడ్డి సంఘం నాయకులు ముకుందరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవిరెడ్డి, సంతోష్‌రెడ్డి, నిర్మలారెడ్డి, రామారెడ్డి, జానకిరెడ్డి, సుజాతరెడ్డి, మంథని మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమారెడ్డి, అధిక సంఖ్యలో రెడ్డి కులస్తులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు నీలం తిరుపతి, గట్టు శంకర్, బాపు గురువారం మాజీ ఎంపీటీసీ ఎలువాక ఓదెలు ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామశాఖ అధ్యక్షుడు తోడేటి శ్రీనివాస్, మల్లెపల్లి స్వామి, చింతల చంద్రయ్య పాల్గొన్నారు.

సుల్తానాబాద్: భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ప్రజలు అప్రమత్తం కావాల్సిన బాధ్యత ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కొదురుపాక గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ ఉపసర్పంచ్ గ్రామశాఖ అధ్యక్షుడు వార్డుసభ్యులు, మున్సిపల్ పరిధిలోని పూసాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వలస నీలయ్యతో పాటు పలువురు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం మాజీ సభ్యులు గురువారం కాంగ్రెస్ ప్రతినిధి బర్పటి తిరుపతి ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గోర్క సంతోష్, లగిశెట్టి దేవేందర్, కట్కూరి లింగమూర్తి, గుమ్మడి శ్రావణ్, అలువాల రాజేశ్, శ్రీరాముల సతీశ్ ఉన్నారు. కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ గాదె సుధాకర్, బీసీ సెల్ అధ్యక్షుడు బర్పటి లక్ష్మణ్, లగిశెట్టి రాకేశ్, గంగాధర్, మల్లేశ్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులను నమ్మితే మోసపోతం



ముత్తారం: ప్రచారంలో పుట్ట మధూకర్

ముత్తారం: పథకాల పేరుతో మోసం చేసే కాంగ్రెసోళ్లను నమ్మొద్దని జెడ్పీచైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. గురువారం ముత్తారం మండలం మచ్చుపేట, లక్కారంలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, మాజీ సర్పంచుల మండల కన్వీనర్ నూనె కుమార్ పాల్గొన్నారు.

ఓదెల: మాయమాటలతో మళ్లీ ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మోసపోయి గోసపడతామని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుండ్లపల్లె, కనగర్తి, శానగొండ, గుంపుల గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచ్ పులుగు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ చెప్పారు. మండలంలోని పెద్దాపూర్, వెంకట్రావుపల్లె గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఉపాధిహామీ పనిస్థలాల వద్ద కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ రమాదేవి, తమ్మడవేని మల్లేశం, కల్లెపెలి అంజయ్య, కొండపల్లి కృష్ణమూర్తి, దుగ్యాల వెంకట్రావు, బడుగు సది, కొమ్మ సతీశ్, రేషవేని మల్లయ్య, పర్లపెల్లి నర్సయ్య ఉన్నారు.

ఎలిగేడు: బీఆర్‌ఎస్ నాయకులు మండలంలోని లాలపల్లిలో ఉపాధిహామీ కూలీల వద్ద ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ దంపతులు తానిపర్తి స్రవంతి–మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు రాజేశం, బద్దం తిరుపతిరెడ్డి, ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, పరమేశ్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జ్యోతినగర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేపట్టారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ ప్రాంతాల్లో ఉద్యమ నాయకులు ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి ఈశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. లావుడ్య వీరాలాల్, కే.వి.చందు, బుర్ర శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఎంపీపీ బాలాజీరావు కోరారు. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలో గురువారం ఉపాధిహామీ పని చేస్తున్న ప్రదేశం వద్ద ప్రచారం చేశారు. సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు రాజమల్లు, మనోజ్‌గౌడ్, గట్టు శ్రీనివాస్‌గౌడ్, మహిపాల్, రమేశ్, సతీశ్ ఉన్నారు.

మోదీ అభివృద్ధిని చూసి బీజేపీని ఆదరించండి



కమాన్‌పూర్: ప్రచారంలో బీజేపీ నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన దేశాభివృద్ధిని చూసి బీజేపీని ఆదరించి పార్టీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి కోరారు. సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామంలో గురువారం ఉపాధిహామీ పని చేస్తున్న ప్రదేశం వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు శంకర్, నర్సింగోజు, రమేశ్, మహేశ్, కందుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

కమాన్‌పూర్: మండల కేంద్రంలో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు జంగపెల్లి అజయ్, నాయకులు మచ్చగిరి రాము, మట్ట శంకర్, అరుణ్‌కుమార్, సదానందం, కొయ్యడ సతీశ్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: దేశానికి నీతివంతమైన పాలనను అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి మూడోసారి అవకాశం కల్పించేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కావేటి రాజ్‌గోపాల్, పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని సుభాష్‌నగర్, మండలంలోని బొంపల్లి, గుర్రాంపల్లి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ దాడి సంతోష్, వేల్పుల రమేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇంటింటా పోల్‌చీటీల పంపిణీ పూర్తి



పోల్ చీటీలు పంపిణీ చేస్తున్న బీఎల్‌వో

సుల్తానాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పాల్గొనేందుకు ఓటర్లకు ఎన్నికల సంఘం రెవెన్యూ అధికారుల ద్వారా ఇంటింటా పోల్‌చీటీల పంపిణీని బీఎల్‌వోలు గురువారం పూర్తి చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంతోపాటు మండలవ్యాప్తంగా 54,895 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 378 మంది మృతిచెందగా, ఇంటి వద్ద 77 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18ఏళ్లు పైబడి ఓటర్లుగా నమోదు చేసుకున్న వారికి 204 మందికి ఓటర్ గుర్తింపు కార్డులను గురువారం పంపిణీని ప్రారంభించారు. మండలవ్యాప్తంగా 62 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 484 పోల్ చీటీలు బ్యాలెన్స్ ఉండగా ఆర్డీవో కార్యాలయానికి పంపించినట్లు ఆయన వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బందితోపాటు పారా మిలటరీ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అధికారులు, సిబ్బందికి పాఠశాలలో బస చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.